నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
శనివారం 7, నవంబర్ 2026
పేజీలు:4

ఈఎస్ఐలో రూ.50 కోట్ల అవినీతి!

- జాయింట్ డైరెక్టర్‌ను తొలగించాలి
- ఈఎస్ఐసీ బోర్డు సభ్యుడు, బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య

4



ఝూన్సీరెడ్డి జోలికొస్తే ఖబడ్దార్



- ఝూన్సీ రెడ్డికి వస్తున్న ప్రజాధారణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాల విషప్రచారాలు
- ప్రజాక్షేత్రంలో ఝూన్సీరెడ్డి బలం చూపిస్తాం..
- వ్యక్తిగత విమర్శలతో నాయకత్వాన్ని దెబ్బతీయలేరు.. కాంగ్రెస్ నేతల ఘాటు కౌంటర్
- ప్రతిపక్షాలు అభివృద్ధిపై చర్చకు రండి..
- నిరాధార ఆరోపణలు మానుకోండి..
- పాలకుర్తిలో రాజకీయ ప్రకంపనలు..
- ఝూన్సీరెడ్డిపై ఆరోపణలకు ఎదురుదాడి



తొర్రూరు, నవంబర్ 6 (ఫోకస్ న్యూస్):

పాలకుర్తి నియోజకవర్గ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం మొదలైంది. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝూన్సీ రాజేందర్ రెడ్డిపై వస్తున్న విమర్శలు, ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా స్పందించారు. ప్రజాసేవతో ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్న నాయకురాలిపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. విమర్శలతో నాయకత్వాన్ని దెబ్బతీయలేరని, ప్రచారాలతో ప్రజాభిమానాన్ని చెరపలేరని కాంగ్రెస్ శ్రేణులు స్పష్టం చేశారు. శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్రచారి, పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్ కాంగ్రెస్ పార్టీ తొర్రూర్ మండలం ప్రధాన కార్యదర్శి మాహంకాళి దేవేందర్ ప్రతిపక్షాల ఆరోపణలకు గట్టిగా సమాధానమిచ్చారు.

మిగతా 2లో..



అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు

- అటవీ అగ్ని ప్రమాదాల నివారణకు సంయుక్త ప్రణాళిక
- వేటను అరికట్టేందుకు శాఖల మధ్య సమన్వయం
- ములుగు జిల్లాలో అటవీ ప్రాంతాలను సందర్శించిన జయేశ్ రంజన్
- క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులతో సమీక్ష

2లో..

నేటి నుంచి 3 రోజులు కొడంగల్‌లో సీఎం పర్యటన

- ఎక్స్‌పోను ప్రారంభించనున్న రేవంత్
- రూ.9,053 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- సీఎంను కలిసేందుకు కాలినడకన కర్నూలు నుంచి హైదరాబాద్‌కు!

హైదరాబాద్, నవంబరు 6 (నేటి ఫోకస్ న్యూస్):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నుంచి మూడు రోజుల పాటు తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో పర్యటిస్తారు. ఇందుకు అధికార యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తన పర్యటనలో భాగంగా దుద్యాల మండలం హకీంపేట్‌లో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతో పాటు కొడంగల్ నియోజకవర్గంలో మిగతా 2లో..




అంతర్రాష్ట్ర దారి దోపిడీ ముఠా అరెస్ట్

- మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులు పట్టివేత
- జిల్లాలో వరుస దారి దోపిడీలకు పాల్పడిన ముఠా
- రాత్రి ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలన్న ఎస్పీ
- అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేయాలని సూచన

సంగారెడ్డి, నవంబర్ 6 (నేటి ఫోకస్ న్యూస్):

జిల్లాలో వరుస దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. జిల్లాలో చోటుచేసుకుంటున్న దారి దోపిడీలకు సంబంధించి పోలీసులు చేపట్టిన దర్యాప్తులో ఈ ముఠా వ్యవహారం వెలుగులోకి మిగతా 2లో..





ఝూన్సీరెడ్డి జోలికొస్తే ఖబడ్దార్..

(మొదటి పేజీ తరువాయి)

ఝూన్సీ, యశస్వినిరెడ్డిల నాయకత్వానికి పెరుగుతున్న ప్రజాదరణ..

పాలకుర్తి నియోజకవర్గంలో మహిళా నాయకత్వం బలంగా ముందుకు సాగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఒకవైపు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తుండగా, మరోవైపు ఝాన్సీ రెడ్డి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం, కార్యకర్తలకు మార్గదర్శకత్వం అందించడం వంటి బాధ్యతల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఝాన్సీ రెడ్డి మార్గదర్శకత్వం, యశస్విని రెడ్డి నాయకత్వం పాలకుర్తి కాంగ్రెస్‌కు ప్రధాన బలంగా మారాయని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న ప్రజల్లో ఝాన్సీ యశస్విని రెడ్డిలకు వస్తున్న ప్రజా ఆదరణ చూసి ఓర్వలేకనే రాజకీయ ప్రత్యర్థులు విమర్శల మార్గాన్ని ఎంచుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు

రాజకీయాల్లోకి రాకముందే సేవా బాట.. ఇదే ఝాన్సీరెడ్డి ప్రత్యేకత

ఝాన్సీ రెడ్డి దంపతులు రాజకీయాల్లోకి రాకముందే సామాజిక సేవకు పెద్దపీట వేశారని కాంగ్రెస్ నాయకులు గుర్తుచేశారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో సుమారు కోటి రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి సహకరించడంతో పాటు పాలకుర్తి నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సహాయం చేయడం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగడం ఆమెకు మొదటి నుంచి అలవాటేనని పేర్కొన్నారు.

అభివృద్ధి కనిపించదా.. ఆరోపణలే కనిపిస్తున్నాయా?

ప్రజలకు చేసిన సేవలను పక్కనపెట్టి వ్యక్తిగత అంశాలను తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయా అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పనిచేస్తోందని చెప్పారు. అభివృద్ధి, ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చకు రావాలని, వ్యక్తిగత విమర్శలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.



విమర్శలకు సమాధానం చెప్పేందుకు సిద్ధం..

ఝాన్సీ రెడ్డి, యశస్విని రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ప్రజాసేవ చేస్తున్న నాయకత్వానికి పార్టీ శ్రేణుల అండ ఉంటుందని, నాయకురాళ్ల ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలోనే ఎవరి బలం ఎంతో తేలుతుందని అన్నారు.

ప్రచారాలు తాత్కాలికం.. ప్రజల అభిమానం శాశ్వతం..

సోషల్ మీడియాలోనో, ఇతర ప్రచార మాధ్యమాల్లోనో వచ్చే ప్రతి కథనం ప్రజల విశ్వాసాన్ని మార్చలేదని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. రాజకీయ నాయకుల పనితీరుకు ప్రజలే అసలైన గీటురాయని, ప్రజాసేవే నాయకత్వానికి శాశ్వత గుర్తింపు తెస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బచ్చలి లక్ష్మణ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వల్లపు యాకయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు అజ్మీర రమేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చిత్తలూరు శ్రీనివాస్, చెవిటి సదాకర్, జాటోత్ రవి నాయక్, సోమవారం ఐలయ్య, ఎనగందుల శ్రీనివాస్, జాటోత్ సురేష్, దొంగరి శంకర్, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు

ములుగు, నవంబర్ 6 (నేటి ఫోకస్ న్యూస్):

అటవీ సంపదను కాపాడటంతో పాటు వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సూచించారు. వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమస్యల నివారణకు అన్ని శాఖలు కలిసి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారుల కు సూచించారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా జయే శ్ రంజన్ తాడ్వాయి అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అటవీ ప్రాంతంలోని పరిస్థితులు, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, అటవీ సంపద పరిరక్షణకు ఎదురవుతున్న సవాళ్లను పరిశీలించారు. అనంతరం ఏటూరునాగారం అభయారణ్యాన్ని సందర్శించి అక్కడి అటవీ పరిసరాలను పరిశీలించారు. వన్యప్రాణుల సంచారం, వాటి ఆవాసాల పరిరక్షణ, అడవుల్లో అక్రమ కార్యకలాపాల నియంత్రణ వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. అటవీ ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగించాలని, వేటగాళ్ల కదలికలను ముందుగానే గుర్తించి అడ్డుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కొండాయి అటవీ ప్రాంతంలోని నిఘా గోపురాన్ని, గుత్తికోయల నివాస ప్రాంతాలను కూడా జయేశ్ రంజన్ సందర్శించారు. అటవీ ప్రాంతాల సమీపంలో నివసించే ప్రజలతో సమన్వయం పెంచుకోవాలని, మనుషులు–వన్యప్రాణుల మధ్య ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అటవీ అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించే వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణ ఒక్క అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదని, అన్ని ప్రభుత్వ విభాగాలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం, పోలీసు, అటవీ శాఖల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని, అటవీ అగ్ని ప్రమాదాలు, అక్రమ వేట నివారణకు సంయుక్త కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.

నేటి నుంచి 3 రోజులు..

(మొదటి పేజీ తరువాయి)

రూ.9,053 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపనలు చేస్తారు. అలాగే రూ.46.08 కోట్లతో నిర్మించిన వివిధ ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు. సీఎం తొలిరోజు పర్యటన అధికారిక షెడ్యూల్ మేరకు.. శనివారం మధ్యాహ్నం 1.55 గంటలకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ ప్రాంగణం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యా హ్నం 2.30 గంటలకు హకీంపేటకు చేరుకుంటారు. 2.40 నుంచి 3.30 గంటల వరకు రైతు మేళా, ఇండ స్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించి స్టాళ్లను సందర్శిస్తారు. ఆ తర్వాత గంట పాటు ఆదర్శ, ప్రగతిశీల రైతులు, శాస్త్రవేత్తలతో సీఎం సమావేశమై ముఖాముఖి మాట్లాడ నున్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పారిశ్రామికవేత్తలతో భేటీ అయి చర్చించనున్నారు. అనంతరం గంట పాటు హకీంపేట్ ఎడ్యుకేషనల్ హబ్ పనులు పరిశీలిస్తారు.

సీఎంను కలిసేందుకు కాలినడకన కర్నూలు నుంచి!

సీఎంపై తనకున్న అభిమానాన్ని చాటుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అభిమాని తాయన్న వినూత్న ప్రయత్నం చేశారు. రేవంత్‌ను కలవాలన్న కోరికతో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు కాలినడకన వచ్చారు. కర్నూలు జిల్లాలోని ఆదోనిలో గత నెల 29న పాదయాత్రను ప్రారంభించిన తాయన్న.. 9 రోజుల పాటు ఏకంగా 350 కిలోమీటర్లు నడిచి శుక్రవా రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌ను కలుసుకొని మురిసిపోయారు.

అంతర్రాష్ట్ర దోపిడీ ముఠా అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి జిల్లాలో దారి దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. వరుస ఘటనల నేపథ్యంలో నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. అయితే నిందితుల పేర్లు, దోపిడీలకు సంబంధించిన పూర్తి వివరాలు, స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు వెల్లడించలేదు. దారి దోపిడీలను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జనసంచారం లేని ప్రాంతాల్లో అనవసరంగా వాహనాలను నిలపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రయాణ సమయంలో పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాత్రి ప్రయాణాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పరితోష్ పంకజ్ సూచించారు. సహాయం అవసరమైనప్పుడు జాతీయ అత్యవసర సేవల నంబరు 112కు ఫోన్ చేయాలని తెలిపారు. సమస్యను స్వయంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయకుండా పోలీసుల సహాయం తీసుకోవడం మంచిదని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినా, దారి దోపిడీ వంటి ఘటనలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండటంతో పాటు పోలీసులకు సహకరిస్తే ఇలాంటి నేరాలను అరికట్టేందుకు మరింత అవకాశం ఉంటుందని తెలిపారు.

నూతన సురక్ష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్





సంగారెడ్డి : నవంబర్ 6 (ఫోకస్ న్యూస్)

సదాశివపేట లో నూతనంగా ఏర్పాటు చేసిన సురక్ష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగారెడ్డి శాసనసభ్యులు గౌరవ శ్రీ చింతా ప్రభాకర్ ఆసుపత్రిని ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని, నూతనంగా ప్రారంభమైన సురక్ష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిం చాలని ఆకాంక్షించారు. ఆధునిక వైద్య సదు-పాయాలతో ప్రజలకు అందుబాటులో ఉండి, ఆరోగ్య సేవల్లో మంచి గుర్తింపు పొందాలని ఆసుపత్రి యాజ మాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

కీర్తిశేషులు పట్లోళ్ల బస్వరాజ్ గారి కుమారుడు డాక్టర్ పట్లోళ్ల రాజ్ కుమార్, డాక్టర్ పట్లోళ్ల శిరీష, వీణ -- (జనరల్ మెడిసిన్)ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు అల్లం లలిత, మాజీ ఎంపీటీసీ బండల శివకుమార్, రవికుమార్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, పాండురంగరాజ్, మన్నె విట్టల్, సీహెచ్ అనిల్, సారా రవి, దుర్గా రెడ్డి, చిలా మల్లన్న, టేకురి జైపాల్, అమరేందర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కొలుకూరు మాణిక్, పెద్దగొల్ల అంజన్న, సలావుద్దీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు





తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ రిపోర్టర్ ఓరుగంటి సైదులు నవంబర్ 6

నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా చైర్మన్ వింజమూరి సుధాకర్, పౌరసరఫరాల శాఖ డీటీ కామేశ్వరరావులు తెలిపారు. పౌరసరఫరాల శాఖ, వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యం లో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కిరాణా దుకా ణాలు, నిత్యవసర సరుకులు విక్రయించే ఆల్ ఇన్ వన్ దుకాణాలను తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో సన్న బియ్యం అధిక ధరలకు అమ్ముతున్నట్లుగా గుర్తిం చారు. బస్తాపై 26 కిలోలు ముద్రించి ఉండగా తూ కం వేయగా 24 కిలోలే కనిపించింది. స్వదేశీ మార్కె ట్లో 25 కిలోల రైస్ బ్యాగ్ ను స్థానికులకు రూ.3 వేలకు విక్రయించారు. స్థానికుల నుంచి ఫిర్యాదును నమోదు చేసుకున్నారు. దాంతోపాటు పలు దుకాణా ల్లో పప్పులు, వంట సామాగ్రి, నూనె అధిక ధరలకు అమ్ముతున్నట్లు గా గుర్తించారు. ఈ సందర్భంగా వింజమూరి సుధాకర్, కామేశ్వరరావు లు మాట్లా డుతూ ఎల్ నినో సాకుతో పాత సరుకులను కొత్త ధరలకు విక్రయించడం, ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరపడం నేరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి సరకులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక చేశారు. మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు నిత్యావసర సరకులను నిర్ణయించిన ధరలకే విక్రయించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చర్యలు తీసు కునేందుకు పౌర సరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ, లేబర్, ఫైర్ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ మండలి జిల్లా అధ్యక్షుడు మైస శ్రీనివాస్, డిసిఐసి సభ్యుడు జాన్, తదితరులు పాల్గొన్నారు.



బాలికల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ రిపోర్టర్ ఓరుగంటి సైదులు నవంబర్ 6



బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహిం చవద్దని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేర మని సోమవరపు కుంట తండా సర్పంచ్ బానోత్ సాగర్ నాయక్, ఐసీడీఎస్ సూప ర్వైజర్ ఎస్.కె. గౌసియాలు అన్నారు. శు క్రవారం మండలంలోని సోమవరపు కుంట తండా గ్రామ పంచాయతీలో సర్పంచ్ అధ్య క్షతన గ్రామ బాలల పరిరక్షణ కమిటీ (వీసీ పీసీ) సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తుకు ఆటం కంగా మారుతాయని, వాటిని అరికట్టేం దుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహ రించాలని సూచించారు. కిశోర బాలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాలికలకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

బాల ల వ్యక్తిగత పరిశుభ్రత,ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి వాణి, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, పాఠశాల హెచ్ఎం రంజిత్, ఉపాధ్యా యుడు ప్రసాద్,అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, సీత,వివో అధ్యక్షురాలు యాక మ్మ, పాఠశాల కమిటీ అధ్యక్షురాలు శాంతమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఈఎస్ఐలో రూ.50 కోట్ల అవినీతి!

జాయింట్ డైరెక్టర్‌ను తొలగించాలి: వేముల మారయ్య

నాచారం,నవంబర్ 6 (నేటి ఫోకస్ న్యూస్):

ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో పారిశుద్ధ్య కాంట్రాక్టుల పేరుతో సుమారు రూ.50 కోట్ల అక్రమాలు జరిగాయని ఈఎస్ఐసీ బోర్డు సభ్యుడు, బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య ఆరోపించారు. శుక్రవారం హెచ్ఎంటీ నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ పద్ధతిలో నచ్చిన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై జాయింట్ డైరెక్టర్ గౌతమ్‌ను తక్షణమే తొలగించి, ఏసీబీతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.మరోవైపు ఈఎస్ఐ ఆసుపత్రుల్లో కార్మికులకు కనీస వైద్య సదుపాయాలు అందడం లేదని, క్యాన్సర్ మందులు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ సౌకర్యాల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

చర్లపల్లి, నవంబర్ 6: (నేటి ఫోకస్ న్యూస్)



చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని ఫేజ్-2, ప్రొఫెసర్ జయశంకర్ పబ్లిక్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరుకాగా, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో, ఎం= ఇంజనీరింగ్ వర్క్స్ రాము సహకారంతో బాక్స్ క్రికెట్, నెట్ క్రికెట్ సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడా ప్రాంగణాలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, స్థానిక క్రీడాకారులు ఈ సదు-పాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ రిపోర్టర్
ఓరుగంటి సైదులు నవంబర్ 6



ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తామని తొర్రూరు ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. తొర్రూరు లోకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని పాల మైసమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు.అనంతరం బాల మైసమ్మ కు పూజలు నిర్వహించి ఆటో డ్రైవ ర్లతో కలిసి సహాపంక్తి భోజనం చేశారు.ఈ సంద ర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు సురక్షి తంగా గమ్యస్థానాలకు చేరడంలో ఆటో డ్రైవర్ల పాత్ర ఎనలేనిదని తెలిపారు. ఆటో డ్రైవర్లు ప్రయా ణికులకు సేవలుఅందిస్తూ మంచి పేరు తెచ్చు కోవాలని కోరారు. మారుమూల ప్రాంతాల ప్రజల కు రవాణా సేవలు అందించడంలో ఆటో డ్రైవర్లు కీలకంగా పని చేస్తున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్లు తమ సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని తెలిపారు.

ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు తీసుకోవాలని, కార్మిక శాఖ అందించే ప్రయోజనాలను పొందాలని కోరా రు. బాలమైసమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండా లని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఆటో కార్మికులు పట్టణ ప్రజలకు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు మంగళపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షులు గొల్లపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి గుండాల రంజిత్, కోశాధికారి మంగళపల్లి ప్రతాప్ కుమార్, సహాయ కార్యదర్శి నడిగడ్డ సదానందం, దారావత్ వెంకన్న,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి, చిట్టిమల్ల మహేష్, అనుమాండ్ల ప్రవీణ్ రెడ్డి,ఎద్దు మహేష్,ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం..
16 లీటర్ల గుడుంబా స్వాధీనం

తొర్రూర్ నేటి ఫోకస్ న్యూస్ రిపోర్టర్
ఓరుగంటి సైదులు నవంబర్ 6



మహబూబాద్ జిల్లా తొర్రూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిబండ తండా, గున్యా తండాల్లో ఎస్సై మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దాడుల్లో అక్రమ గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 200 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే 16 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ దందాతో సంబంధం ఉన్న నలుగురు వ్యక్తులకు చెందిన స్థావరాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. అక్రమంగా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా ఉపేక్షించేది లేదని, సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేందర్ రెడ్డి హెచ్చరించారు.

అంతర్రాష్ట్ర దారి దోపిడీ ముఠా అరెస్ట్

- మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులు పట్టివేత
- జిల్లాలో వరుస దారి దోపిడీలకు పాల్పడిన ముఠా
- రాత్రి ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలన్న ఎస్పీ
- అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేయాలని సూచన

సంగారెడ్డి, నవంబర్ 6 (నేటి ఫోకస్ న్యూస్):

జిల్లాలో వరుస దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరె-స్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. జిల్లాలో చోటుచేసుకుంటున్న దారి దోపిడీలకు సంబంధించి పోలీసులు చేపట్టిన దర్యాప్తులో ఈ ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి జిల్లాలో దారి దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. వం-రుస ఘటనల నేపథ్యంలో నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. అయితే నిందితుల పేర్లు, దోపిడీలకు సంబంధించిన పూర్తి వివరాలు, స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు వెల్లడించలేదు.

దారి దోపిడీలను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జనసంచారం లేని ప్రాంతాల్లో అనవసరంగా వాహనాలను నిలపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రయాణ సమయంలో పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రాత్రి ప్రయాణాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పరితోష్ పంకజ్ సూచించారు. సహాయం అవసరమైనప్పుడు జాతీయ అత్యవసర సేవల నంబరు 112కు ఫోన్ చేయాలని తెలిపారు. సమస్యను స్వయంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయకుండా పోలీసుల సహాయం తీసుకోవడం మంచిదని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినా, దారి దోపిడీ వంటి ఘటనలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండటంతో పాటు పోలీసులకు సహకరిస్తే ఇలాంటి నేరాలను అరికట్టేందుకు మరింత అవకాశం ఉంటుందని తెలిపారు.